సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం ♦ 29 ♦ ఏప్రిల్ ♦ 2025



విజయవంతంగా హ్యాకథాన్

మదనపల్లె దగ్గర అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 24 గంటల పాటు జాతీయ స్థాయి ఇంటర్ ఇన్‌స్టిట్యూషనల్ హ్యాకథాన్ ఇంపాక్స్-25ను విజయవంతంగా నిర్వహించారు. - 8లో



సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం చేయరాదని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. బాధితులకు సత్వర న్యాయం అందించాలన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 383 మెట్రిక్ టన్నులు



కస్తూర్బా బాలిక.. విజయగీతిక

- పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ
- 79 శాతం ఉత్తీర్ణత
- ప్రథమ స్థానం విద్యార్థినికి 572 మార్కులు

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆశయం నిజమవుతోంది. ఏ ఆధారం లేని బాలికల చదువు కోసం ఆయన సీఎంగా ఉన్నప్పుడు కస్తూర్బాగాంధీ విద్యాలయాలు(కేజీబీవీలు) నెలకొల్పారు. వైఎస్సార్ తనయుడు మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కేజీబీవీలకు కార్పొరేట్ హంగులు సమకూర్చారు. వాటిలో ఇంటర్ విద్యను ప్రవేశపెట్టారు. ఈ విద్యాలయాలు ఫలితాల్లో సత్తా చాటుతున్నాయి. ఇంటర్, పదో తరగతి ఫలితాల్లో తిరుగులేని ఆధిపత్యం చూపి భేష్ అనిపించుకున్నాయి.





తంబళ్లపల్లె కేజీబీవీ విద్యాలయం

మదనపల్లె సిటీ : జిల్లాలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కస్తూర్బాగాంధీ విద్యాలయల (కేజీబీవీ) బాలికలు సత్తా చాటారు. జిల్లాలో 22 కేజీబీవీలు ఉండగా వాటిలో 798 మంది పదో తరగతి పరీక్షలు రాశారు. వారిలో 631 మంది పాసై 79 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రతిభకు పేదరికం అడ్డు కాదని నిరూపించారు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుల్లో రాణించారు. తమ కుటుంబాల నేపథ్యాలను గుర్తెరిగి మంచి ఫలితాలతో అందరి మన్ననలు పొందుతున్నారు.

నెరవేరుతున్న వైఎస్సార్ కల

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయం నిజమవుతోంది. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన, ఆర్థిక స్థోమత లేకుండా, పేదరికంలో ఉండి చదవాలనే ఆసక్తి ఉన్నా... పరిస్థితులు అనుకూలించని ఎంతో మంది నిరుపేద బాలికలు చదువుకోవాలనే లక్ష్యం ఫలిస్తోంది. నేడు ఎంతో మంది విద్యార్థులు బాగా చదివి... విద్యావంతులై భళా అనిపిస్తున్నారు. 2005లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి కేజీబీవీలను ఏర్పాటు చేశారు. వాటిలో ఆహ్లాదకరమైన వాతావరణం, ఇంగ్లీషుమీడియంలో బోధన, అత్యంత భద్రతతో కూడిన వసతి సదుపాయాలు కలిగి బాలికలు విద్యావంతులుగా తయారవుతున్నారు. ఈ విద్యాలయాల్లో సాధారణ విద్యతో పాటు ఆంగ్లమాధ్యమం,యోగా, వృత్తి విద్యా కోర్సుల ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇవి బాలికలకు చదువుతో పాటు బతుకు దెరువుకు భరసా కల్పిస్తున్నాయి. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కేజీబీవీలకు లక్షలు ఖర్చు చేసి మరిన్ని వసతులు, సౌకర్యాలు కల్పించారు. పదో తరగతి తర్వాత వారు డ్రాపౌట్స్‌గా మారేందుకు వీలులేకుండా కేజీబీవీలలో ఇంటర్ విద్యను కూడా ప్రవేశపెట్టి మరో అడుగు ముందుకు వేశారు.

ఇతర కేజీబీవీల్లో ఫలితాలు..

బి.కొత్తకోట కేజీబీవీలో ఎస్.ఫహీనాజుమ్ 544 మార్కులు, వగళ్ల కేజీబీవీలో వై.రేఖ 548, కలకడ కేజీబీవీకి చెందిన ఎం.జయంతి 516, ములకలచెరువు కేజీబీవీకి చెందిన స్నేహలత 488, నిమ్మనపల్లె కేజీబీవీలో వి.తేజస్విని 535, పెద్దమండ్యం కేజీబీవీలో ఎం.మౌనిక 525, పీటీఎం కేజీబీవీలో ఎ.స్నేహలత 459, రామసముద్రం కేజీబీవీలో పుష్పావతి 520, చిట్వేలి కేజీబీవీకి చెందిన హరిత 480, గాలివీడు కేజీబీవీలో డి.ప్రీతి 465, లక్కిరెడ్డిపల్లె కేజీబీవీకి చెందిన పి.కావ్యశ్రీ 480, పెనగలూరు కేజీబీవీలో ఎం.కవిత 515, పుల్లంపేట కేజీబీవీలో పల్లవి 547, రామాపురం కేజీబీవీలో ఆశ 549, రాయచోటి కేజీబీవీకి చెందిన సాయిశ్రీ 539, వీరబల్లి కేజీబీవీల్లో యమున 545 మార్కులు సాధించి ఆయా పాఠశాలల్లో టాపర్స్‌గా నిలిచారు.

నేటి నుంచి రెమిడియల్ తరగతులు:

జిల్లాలో మూడు సెంటర్లలో రెమిడియల్ తరగతులు సోమవారం నిర్వహిస్తున్నట్లు జీసీడీఓ మధుమతి తెలిపారు. రాయచోటి ప్రాంతానికి గాలివీడు కేజీబీవీ, మదనపల్లె ప్రాంతానికి బి.కొత్తకోట కేజీబీవీ, రాజంపేట ప్రాంతానికి పెనగలూరు కేజీబీవీలో రెమెయల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కేజీబీవీలలో టాపర్స్ వీరే..


సాయిప్రగతి, యశ్విత, మహాలక్ష్మి, దీపిక, వైష్ణవి, దీక్షిత

జిల్లాలోని కేజీబీవీల్లో పదో తరగతిలో మంచి మార్కులు సాధించారు. ఇందులో సంబేపల్లి కేజీబీవీకి చెందిన బి.సాయిప్రగతి 572 మార్కులు సాధించి మొదటి స్థానం నిలిచింది. చిన్నమండ్యం కేజీబీవీలో బి.యశ్విత 571, సుండుపల్లి కేజీబీవీకి చెందిన జి.మహాలక్ష్మి 569, కురబలకోట కేజీబీవీలో ఎం.దీపిక 559, ఓబులవారిపల్లె కేజీబీవీలో పి.వైష్ణవి 553, తంబళ్లపల్లె కేజీబీవీకి చెందిన దీక్షిత 551 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు.

నిత్యం పర్యవేక్షణ

జిల్లాలోని కలెక్టర్, డీఈఓల సూచనలు, సలహాలు పాటిస్తూ కేజీబీవీలను నిత్యం పర్యవేక్షిస్తున్నాం. స్టడీ అవర్స్, వారాంతం పరీక్షలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు మార్కుల సాధనపై దృష్టి పెట్టాం. తక్కువ మార్కులు వచ్చే వారి పట్ల ప్రిన్సిపాళ్లతో ప్రత్యే శ్రద్ధ తీసుకున్నాం. దీంతో ఉత్తమ ఫలితాలు సాధించాం.

– మధుమతి, జీసీడీఓ, సమగ్రశిక్ష

సంతృప్తికర ఫలితాలు



కేజీబీవీల ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయి. 22 కేజీబీవీలో 79 శాతం ఉత్తీరణ సాధించాం. చాలా మంది విద్యార్థులకు 500 మార్కులుపైగా వచ్చాయి. ఫలితాల పరంగా సంతోషంగా ఉంది.

– సుబ్రమణ్యం, జిల్లా విద్యాశాఖ అధికారి.

న్యూస్‌రీల్

దరఖాస్తు చేసుకోండి

రాయచోటి టౌన్ : ఉమ్మడి కడప జిల్లాలోని మైనార్టీలు, క్రిస్టియన్లు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తుచేసుకోవాలని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వి.బ్రహ్మయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు 50శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు http://apobmms.apcfss.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9290448452 /08562-241137 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రేపు ఉద్యోగ మేళా

రాయచోటి జగదాంబసెంటర్ : జిల్లా ఉపాధి కార్యాలయం వారి ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన పీలేరులోని ఎస్‌జీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రముఖ కంపెనీలతో ఉద్యోగమేళా జరగనుంది. ఈ విషయాన్ని జిల్లా ఉపాధి కల్పనా అధికారి సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు కంపెనీల్లో పనిచేసేందుకు ఆసక్తి గల యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ చదివి 18–35 సంవత్సరాలు కలిగి ఉండాలని తెలిపారు.

వైభవంగా పల్లకీ సేవ


పల్లకీలోఊరేగుతున్న భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ నిర్వహించారు. సోమవారం రాత్రి మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఉత్సవ మూర్తులను వివిధరకాల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు.ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో డివి రమణారెడ్డి, స్థానికులతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

నూతన నియామకం


చౌడవరం సుబ్బనరసయ్య

రాజంపేట : రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షునిగా చౌడవరం సుబ్బనరసయ్య నియమితులయ్యారు. ఈమేరకు ఆర్‌పీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.వెంకటస్వామి ఉత్తర్వులను విడుదల చేశారు. కేంద్రమంత్రి (సామాజికన్యాయం, సాధికారిత) రాందాస్ అత్వాలే ఆదేశాల మేరకు రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండలం బొమ్మవరానికి చెందిన సుబ్బనరసయ్యను జిల్లా అధ్యక్షునిగా నియమించారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ


రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ ఖాదర్‌వల్లి

వీరబల్లి : మండలంలో తాటిగుంటపల్లి పంచాయతీలో నిధులు దుర్వినియోగం జరిగాయంటూ పంచాయతీలోని కొందరు తెలుగుదేశం పార్టీ నాయకులు సర్పంచ్‌పై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సోమవారం జిల్లా ఇన్‌చార్జి పంచాయతీ అధికారి (డీపీఓ) ఖాదర్‌వల్లి విచారణ జరిపారు. ఫిర్యాదుదారులను సచివాలయానికి పిలిపించి వారి సమక్షంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నిధుల దుర్వినియోగానికి సంబంధించి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపినాథ్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ డిగ్రీ పరీక్షలు షురూ

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఏ, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ ,బీకాం, బ్యాచిరల్ ఆఫ్ వొకేషనల్ 2,4,6 సెమిస్టర్ల పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు 80 కళాశాల నుంచి 55 కేంద్రాల్లో 25,892 మంది విద్యార్థులు రాస్తున్నారు. కడపలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల, స్పిరిట్స్ డిగ్రీ కళాశాల కేంద్రాలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాస రావు , వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు తనిఖీ చేశారు. విద్యార్థులకు ఏ అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు మాట్లాడుతూ పరీక్షలు మే 24వ తేదీ వరకు ఉంటాయన్నారు.

గ్రీస్ దేశంలో ఉద్యోగావకాశాలు

రాయచోటి జగదాంబసెంటర్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) వారి ఆధ్వర్యంలో స్కిల్ ఇంటర్నేషనల్ ప్లేస్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా గ్రీస్ దేశంలో ఉద్యోగావకాశాలు ఉన్నాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల యువకులు తమ బయోడేటాలను skillnternational@apssdc.inకు పంపాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ లింకు https://naipunyam.ap.gov.in/program&registration అని తెలిపారు. మరిన్ని వివరాలకు 9988853335, 8712655686, 8790118349, 8790117279 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు

రాయచోటి జగదాంబసెంటర్ : జిల్లాలోని ప్రైవేట్.. అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.సుబ్రమణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో 1వ తరగతికి అర్హులైన వారికి ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలో చదువుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు ఏప్రిల్ 30వ తేదీలోపు వెబ్ పోర్టులో తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మే 20 నుంచి 24వ తేదీ వరకు గ్రామ సచివాలయం వార్డు సచివాలయం డేటా ద్వారా విద్యార్థి అడ్మిషన్లకు అర్హతను నిర్ణయిస్తారని తెలిపారు. మే 29న మొదటి రౌండ్ లాటరీ ఫలితాను ప్రచురిస్తారన్నారు. ఎంపికైన వారి అడ్మిషన్లను జూన్ 8న పాఠశాల ద్వారా ధృవీకరించి, జూన్ 11న రెండో లాటరీ ఫలితాన్ని ప్రచురిస్తారన్నారు. జూన్ 18న ఎంపికైన విద్యార్థుల అడ్మిషన్లను ఆయా పాఠశాలల ద్వారా ధృవీకరించడం జరుగుతుందన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయం, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దీనికి సంబంధించి హెల్ప్ డెస్క్ టోల్ ఫ్రీ నంబర్ 18004258599లో సంప్రదించవచ్చని డీఈఓ పేర్కొన్నారు.

సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

రాయచోటి : ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా అందిన అర్జీలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని సూచించారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందన్నారు. కావున అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరుశాతం పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ మధుసూదనరావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్‌డీసీ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కడప డీసీసీబీ చైర్మన్‌గా సూర్యనారాయణరెడ్డి

- కాంట్రాక్టర్‌గా బెంగుళూరులో స్థిరపడ్డ నేతకు దక్కిన పదవి
- జిల్లాలో టీడీపీ జెండా మోసిన నాయకులకు గుండు సున్నా
- ఆవిర్భావం నుంచి పార్టీ అంటిపెట్టుకొని ఉన్న నేతలు విస్మయం
- డీసీఎంఎస్ చైర్మన్‌గా జయప్రకాష్



సాక్షి ప్రతినిధి, కడప : కడప డీసీసీబ్యాంకు చైర్మన్‌గా అట్లూరు మండలానికి చెందిన ఎం సూర్యనారాయణరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వేములూరు గ్రామానికి చెందిన ఆయన కాంట్రాక్టర్‌గా బెంగళూరులో స్థిరపడ్డారు. ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చి పోయే సూర్యనారాయణరెడ్డిని డీసీసీబ్యాంకు చైర్మన్‌గిరి వరించింది. కడప పార్లమెంట్ పరిధిలో డీసీసీబీ చైర్మన్ రెడ్డి సామాజిక వర్గానికి, రాజంపేట పార్లమెంటు పరిధిలో డీసీఎంఎస్ చైర్మన్ కాపు సామాజిక వర్గం ద్వారా నియమించాలనే దిశగా సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో డీసీఎంఎస్ చైర్మన్‌గా రైల్వేకోడూరు నియోజకవర్గానికి చెందిన జయప్రకాష్‌ను నియమించారు.

చక్రం తిప్పుతున్న వాసు...

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి చక్రం తిప్పుతున్నారు. సూర్యనారాయణరెడ్డికి డీసీసీబీ చైర్మన్ ఎంపిక కావడం వెనుక తెరవెనుక ప్రోత్సాహం అందించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే బద్వేల్‌పై కన్నేసి ఉంచిన ఆయన టీడీపీ ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డికి చాపకింద నీరులా వ్యతిరేక వర్గాన్ని ప్రోత్సహిస్తున్నట్లు టీడీపీ సీనియర్లు భావిస్తున్నారు. అవకాశం వస్తే ఒక్కమారుగా రితేష్‌రెడ్డి వ్యతిరేకులంతా శ్రీనివాసులరెడ్డి చెంతన చేరిపోయేలా పథక రచన చేస్తున్నట్లు సమాచారం. పార్టీకి చేసిన సేవా, సమర్థత కంటే ఆర్థిక బలం ఉన్న సూర్యనారాయణరెడ్డి లాంటి వారిని చేరదీస్తున్నట్లు పలువురు వివరిస్తున్నారు. దూరదృష్టితో ప్రతి సందర్భంలోనూ వ్యవహారం తనకు అనువుగా మల్చుకుంటున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

నమ్ముకున్న వారిని నట్టేట ముంచడమే...

తెలుగుదేశం పార్టీనే నమ్ముకొని ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులకు అధినేత చంద్రబాబు ఎగనామం పెట్టారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో తగిన ప్రాధాన్యత లభిస్తుందనుకున్న వారికి నిరాశే ఎదురైంది. ఎన్నికల సమయంలో మాత్రమే కన్పించే సూర్యనారాయణరెడ్డి లాంటి వారికి డీసీసీబీ చైర్మన్‌గిరి లభించింది. వేములూరు గ్రామం మినహా మండల స్థాయిలో కూడా ఇప్పటికీ రాజకీయాలు నెరపని సూర్యనారాయణరెడ్డికి పదవి లభించడం వెనుక ఆర్థిక స్థోమత మాత్రమే గుర్తించినట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు. కాగా జీవితాంతం టీడీపీ జెండా మోస్తూ వచ్చిన నేతలను కనీస పరిగణలోకి తీసుకోకపోవడం గమనార్హం. డబ్బున్న నేతల్ని ఎంచుకొని నామినేటెడ్ పదవులు అప్పగిస్తున్నారు. పార్టీనే నమ్ముకొని అంటిపెట్టుకొని వస్తున్న సింగారెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, హరిప్రసాద్, అమీర్‌బాబు లాంటి నేతలు జిల్లా కేంద్రంలో అర్హులుగా ఉన్నప్పటికీ కనీస పరిగణలోకి తీసుకోలేదని పలువురు వివరిస్తున్నారు. ఎన్ని కష్టాలు..నష్టాలు ఎదురైనా జమ్మలమడుగు నుంచి జంబాపురం రమణారెడ్డి, ప్రొద్దుటూరు నుంచి ఈవీ సుధాకరరెడ్డి, పులివెందుల నుంచి పేర్ల పార్థసారధిరెడ్డిలాంటి వారు అర్హులైనప్పటికీ వారిని పరిగణలోకి తీసుకోకపోవడంపై పలువురు టీడీపీ నేతలు పెదవి విరుస్తున్నారు.

11న అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలంలో గిరి ప్రదక్షిణ కోసం వెళ్లే వారి కోసం మే 11వ తేదీన ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు.

- కడప డిపో నుంచి ఉదయం 6 గంటలకు గోల్డెన్ టెంపుల్ మీదుగా, రాత్రి 9 గంటలకు రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా బస్సులు బయలుదేరుతుందన్నారు. ఇందులో టిక్కెట్ ధర రూ. 1044 గా ఉందన్నారు.
- బద్వేలు డిపో నుంచి ఉదయం 9.00 గంటలకు కడప, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అల్ట్రా డీలక్స్ బస్సు బయలుదేరుతుందన్నారు. ఇందులో ఛార్జి రూ. 1282లు.
- మైదుకూరు డిపో నుంచి మధ్యాహ్నం 3 గంటలకు కడప, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరుతుంది. ఇందులో రూ. 1209 చార్జీగా నిర్ణయించారు.
- ప్రొద్దుటూరు డిపో నుంచి సాయంత్రం 6 గంటలకు మైదుకూరు, కడప మీదుగా సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరుతుంది. ఇందులో టిక్కెట్ ధర రూ. 1273లు.
- పులివెందుల డిపో నుంచి ఉదయం 7 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు రాయచోటి, పీలేరు మీదుగా నడుస్తుందన్నారు. ఇందులో ఛార్జి రూ. 1242గా ఉందన్నారు.

అతివేగం తెచ్చిన అనర్థం


మృతి చెందిన సుహేల్‌ఖాన్ (ఇన్‌సెట్) (ఫైల్ ఫొటో)


మృతి చెందిన జహరాబీ (ఇన్‌సెట్) (ఫైల్ ఫొటో)

- ఆటోను ఢీకొన్న లారీ
- ఇద్దరు మృతి : అయిదుగురికి గాయాలు


నుజ్జునుజ్జయిన ఆటో

రైల్వేకోడూరు అర్బన్/నందలూరు: రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట గుండాలేరు బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారు జామున నందలూరు నుంచి తిరుపతికి వెళుతున్న ఆటోను అతివేగం కారణంగా నియంత్రణ కోల్పోయిన లారీ ఢీకొంది. ఈ సంఘటనలో ఆటో నుజ్జునుజ్జయింది.నందలూరుకు చెందిన పి.జహరాబీ (60), పి.సుహేల్‌ఖాన్ (15)లు అక్కడికక్కడే మృతి చెందారు.ఆటోలో ఉన్న రహీముల్లా, ఫరిహానా, సుహానాఖాన్, షాహీదా, అబ్దుల్లాలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 ద్వారా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తిరుపతిలో నివాసముంటున్న రహీముల్లా నందలూరులోని అత్తగారి ఇంటికి వచ్చాడు. ఒక రోజు ఉండి వేసవి సెలవులు కావడంతో బంధువులను తిరుపతిలోని తన ఇంటికి ఆటోలో తీసుకుని బయలుదేరాడు. మార్గమధ్యంలో అనంతరాజుపేట వద్ద రాజంపేట వైపు వెళుతున్న టీఎస్88ఎల్807 నంబర్ గల లారీ ఢీ కొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. లారీ డ్రైవర్ రఘురామన్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్‌బాబు తెలిపారు.

బసినికొండలో టీడీపీ బరితెగింపు

- 15కోట్ల విలువైన ప్రభుత్వస్థలం ఆక్రమణకు సన్నాహాలు
- పట్టపగలే జేసీబీతో చదునుపనులు
- ఎమ్మెల్యే చెప్పాడంటూ అధికారులకు బెదిరింపులు


కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు చదును చేసిన టీడీపీ నాయకులు


జేసీబీతో ప్రభుత్వగయాళు భూమిని చదునుచేయిస్తున్న దృశ్యం

మదనపల్లె : కూటమిప్రభుత్వ పాలనలో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. మదనపల్లె పట్టణశివారు ప్రాంతాల్లో ప్రధాన రహదారికి సమీపంలో కోట్ల విలువచేసే ప్రభుత్వస్థలాలు ఉండటంతో తమ్ముళ్ల కన్ను వీటిపై పడింది. ముఖ్యంగా బసినికొండ పంచాయతీలో టీడీపీ నాయకులు బరితెగించి ప్రభుత్వస్థలాలను ఇష్టారాజ్యంగా ఆక్రమించేస్తున్నారు. ఏకంగా సచివాలయానికి కూతవేటు దూరంలో సోమవారం ఉదయం జేసీబీతో బహిరంగ మార్కెట్లో రూ.15కోట్లకు పైగా విలువచేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు పూనుకున్నారు. స్థానికులు గమనించి మొదట అధికారులకు సమాచారం అందించారు. వారు అక్కడకు వెళ్లి విచారిస్తే..ఎమ్మెల్యే పేరు చెప్పి బెదిరించారు. దీంతో వారు అక్కడ నుంచి వెనుదిరగడంతో స్థానికులు మీడియాకు తెలిపారు.... ఇది ప్రభుత్వగయాళు స్థలం. దీనికి సంబంధించి మీవద్ద ఏ రికార్డులు ఉన్నాయని రిపోర్టర్లు అడిగితే..తమకేమీ తెలియదని అంతా ఎమ్మెల్యేకే తెలుసు అంటూ బుకాయించారు. దీంతో మీడియా వ్యక్తులు తహసీల్దార్ ధనంజయులు, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు వాట్సప్‌లో ఫొటోలు పంపి, సమాచారం తెలపడంతో ఆక్రమణదారులు పనులు నిలిపివేసి మెల్లగా జారుకున్నారు.

ఆరేళ్ల క్రితమే సాక్షిలో కథనం...

2019 ఫిబ్రవరిలో బసినికొండకు చెందిన టీడీపీ మైనారిటీ నాయకుడు ఎస్.ఎం.రఫీ..ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో బసినికొండ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్.682 గయాళుభూమిలో తప్పుడు పత్రాలతో దరఖాస్తు పట్టాలు సృష్టించి భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేశాడు. ఈ విషయాన్ని పసిగట్టిన సాక్షి..ఆక్రమణపై కథనం ప్రచురించడంతో ఎట్టకేలకు పనులు నిలిపివేశారు. తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ ఆటలు సాగవని గుట్టుగా ఉండిపోయారు. ప్రస్తుతం మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో...ఎలాగైనా విలువైన ప్రభుత్వస్థలాన్ని ఆక్రమించుకునేందుకు తప్పుడు పత్రాలతో తమ్ముళ్లు సిద్ధమైపోయారు. దీనిపై తహసీల్దార్ ధనంజయులు వివరణ ఇస్తూ..సమాచారం తెలిసిన వెంటనే పనులు నిలిపివేయించామన్నారు. ఆక్రమణదారులు చూపిస్తున్న దరఖాస్తు పట్టాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

గడ్డివాములో మగ శిశువు లభ్యం


మగ శిశువును ఐసీడీఎస్ అధికారులకు అప్పగిస్తున్న దృశ్యం

వీరబల్లి : మండలంలోని దిగువరాచపల్లి పంచాయతీ పెద్ద దళితవాడ సమీపంలోని గంగమ్మ గుడి దగ్గర గడ్డివాములో ఆదివారం మగ శిశువును వదిలి వెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో వీర నాగయ్య అనే వ్యక్తి తమ గడ్డివాము దగ్గరకు వెళ్లి గడ్డి పీకుతుండగా మగ శిశువును గుర్తించాడు. వెంటనే అతను శిశువును రాయచోటి ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆరోగ్యంగా ఉన్నాడని వైద్యులు తెలపడంతో తిరిగి తన గ్రామానికి తీసుకువచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, అంగన్ వాడీ సూపర్ వైజర్ సరస్వతమ్మ ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. సోమవారం మగశిశువును స్వాధీనం చేసుకున్న అధికారులు రాయచోటి ఐసీడీఎస్ కార్యాలయానికి తీసుకెళ్లారు.

ఘర్షణ కేసులో 11 మంది అరెస్ట్

కేవీపల్లె : ఇరువర్గాలు ఘర్షణ పడి పరస్పరం దాడి చేసుకున్న కేసులో 11 మంది నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తిమ్మాపురానికి చెందిన రెండు వర్గాలు పరస్పరం దాడి చేసుకోగా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. గొడవకు కారణమైన 11 మందిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు ఆటంకం కల్గిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మృతి చెందిన కిషోర్

తంబళ్లపల్లె : స్థానిక మల్లయ్య కొండ కింద మద్దాతం బావి వంకలో చెట్టుకు ఉరివేసుకుని ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు.. బి.కొత్తకోట మండలం తాకట్టుమారిపల్లెకు చెందిన ఓబులేసు, నాగరత్నమ్మల కుమారుడు కిషోర్ (21) మూడు రోజులుగా కన్పించలేదని అతని కోసం పలు చోట్ల వెతికినట్లు మృతుని తండ్రి తెలిపారు. మల్లయ్యకొండ కింద మద్దాతం బావి వంకలో ఓ కానుగ చెట్టుకు యువకుడు ఉరివేసుకుని వేలాడుతున్న విషయాన్ని గొర్రెల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్‌ఐ నజీర్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ ఉన్న పల్సర్ ద్విచక్రవాహనం నంబర్ ఆధారంగా మృతుని చిరునామా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని ఎడమచేతిపై కోసుకున్న గాట్లు ఉండటం, వేలాడుతున్న మృతదేహం కాళ్లకు చెప్పులు అలాగే ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

సాంకేతిక విద్య.. భవితకు భరోసా!

- పదవ తరగతి విద్యార్థులకు చక్కటి అవకాశం
- పాలిటెక్నిక్ విద్యతో మంచి ఉద్యోగావకాశాలు
- రేపు పాలిసెట్ ప్రవేశ పరీక్ష
- జిల్లాలో 8 వేల మంది దాకా పరీక్ష రాయనున్న విద్యార్థులు
- జిల్లాలో 16 పరీక్షా కేంద్రాల ఏర్పాటు


కడపలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో కోచింగ్ తీసుకున్న విద్యార్థులు

జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు	07
జిల్లాలో ఉన్న ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు	08
ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అందుబాటులో ఉన్న సీట్లు	2000
ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో అందుబాటులో ఉన్న సీట్లు	3600
ప్రైవేటు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల మొత్తం సీట్లు	5600

కడప ఎడ్యుకేషన్ : పదవ తరగతి తరువాత వీలైనంత తొందరగా ఉద్యోగం సంపాదించాలనుకునే వారికి పాలిటెక్నిక్ కోర్సులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. సాధారణంగా పదవ తరగతి తరువాత ఇంటర్, డిగ్రీ కోర్సులు చేయడం సాధారణం. అయితే డిగ్రీ పూర్తయి ఉద్యోగం వచ్చేంత సమయం లేకపోవడంతో చాలామంది పాలిటెక్నిక్ కోర్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. పదవ తరగతి విద్యార్హతతో సాంకేతిక విద్యకు పునాది వేసే పాలిసెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షలలో ఉత్తమ ర్యాంకు సాధించిన వారికి రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ ప్రవేశాలు లభిస్తాయి. ఇటీవలే పదవ తరగతి పరీక్షలు కూడా ముగిశాయి. ఫలితాలను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా పాలిసెట్ కోసం దాదాపు 8 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు.

మెండుగా ఉద్యోగ అవకాశాలు..

పదవ తగరతి చదివిన వెంటనే సాంకేతిక విద్య చదవాలనే గ్రామీణ పేద విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సు గొప్ప అవకాశం. ఇంజనీరింగ్ వంటి అత్యున్నత సాంకేతిక విద్య అభ్యసించడం ఎక్కువ ఖర్చుతో కూడుకున్నది. పాలిటెక్నిక్‌లో ఏ కోర్సు చేసినా ఉద్యోగం, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయి. దీంతో భావి జీవితానికి బాటలు వేసుకునే అవకాశం ఉంటుంది. ఇటీవల వివిధ సంస్థలు నేరుగా కళాశాలలకు వెళ్లి పాలిటెక్నిక్ చివరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులను తమ సంస్థలో ఉద్యోగాలకు ఎంపిక చేస్తున్నారు.

ఈ నెల 30న ప్రవేశ పరీక్ష..

ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు పాలిసెట్ పరీక్ష రాయాల్సిందే. పాలిసెట్ దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 17వ తేదీతో గడువు ముగిసింది. ఈ నెల 30వ తేదీన పాలిసెట్ ప్రవేశ పరీక్షను కూడా నిర్వహించనున్నారు. ఈ పరీక్ష 120 మార్కులకు ఉంటుంది. ఇందులో గణితం 50 మార్కులకు, ఫిజిక్స్ 40 మార్కులకు, కెమిస్ట్రీ 30 మార్కులకు ఉంటుంది. పదవ తరగతి సిలబస్ ఆధారంగా పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష కోసం కడప, ప్రొద్దుటూరులలో 16 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా 8 వేల మంది దాకా ఈ పాలిసెట్ ప్రవేశ పరీక్షను రాయనున్నారు.

కోర్సుల వివరాలు ఇలా..

ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో సివిల్, మెకానికల్, ట్రిబుల్ ఈఈ, కంప్యూటర్ మెకానిక్, ఈసీఈ, ఎంఈసీలతోపాటు ఒకటి రెండు కొత్త కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. జిల్లా మొత్తం పైన ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 15 పాలిటెక్నిక్ కళాశాలకుగాను 5600 సీట్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష కోసం కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థుల కోసం ఉచిత కోచింగ్ నిర్వహించారు. ఈ ఉచిత కోచింగ్ 28వ తేదీతో ముగిసింది.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 30వ తేదీన పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించిన పాలిసెట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకుఅన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు. సోమవారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో అడిషనల్ కో ఆర్డినేటర్ దామోదరంతో కలిసి ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష కోసం కడపలో 12 పరీక్షా కేంద్రాలను, ప్రొద్దుటూరులో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ 16 పరీక్షా కేంద్రాలలో దాదాపు 12500 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాస్తున్నారని తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు ఉంటుందని తెలిపారు. విద్యార్థులంతా ఉదయం 10 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఎవరికైనా ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ కాకపోతే 29వ తేదీ మధ్యాహ్నంలోగా కడపలోని ప్రభుత్వ మహిళా కళాశాలను సంప్రదించాలని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి పరీక్ష రాసేందుకు వచ్చే వారి కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు.

ర్యాంకు సాధిస్తాం..



ఈ నెల 30వ తేదీ నిర్వహించే పాలిసెట్ ప్రవేశ పరీక్షలో తప్పకుండా ర్యాంకు సాధిస్తాం. మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో తీసుకున్న కోచింగ్ నాకు బాగా ఉపయుక్తంగా ఉంది. బాగా చదువుకున్నాను.
- వినూతన, కడప

మంచి శిక్షణ పొందాం..



కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా ఇచ్చిన శిక్షణ చాలా బాగుంది. ఇక్కడ ఇచ్చిన శిక్షణతో బాగా ప్రిపేర్ అయ్యాను. ర్యాంకు సాధిస్తాననే నమ్మకం ఉంది.
- నిఖిల్, కడప

ఉచిత మెటీరియల్ ఎంతో ఉపయుక్తం..



ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ ప్రవేశ పరీక్ష కోసం ఇచ్చిన మెటీరియల్ బాగా ఉంది. దీంతో పాటు ఉచిత కోచింగ్ కూడా ఉపయోగపడుతుంది. తప్పకుండా ర్యాంకు సాధిస్తాం.
- వర్షిత, కడప

చిన్న వయసులోనే ఉద్యోగావకాశాలు..



పదో తరగతి తర్వాత తక్కువ ఫీజులతో సాంకేతిక విద్య లభించే కోర్సు పాలిటెక్నిక్. ఈ కోర్సు చేయడం ద్వారా విద్యార్థుల భావి జీవితానికి బంగారు బాటలు వేసుకునే అవకాశం లభిస్తుంది.జాబ్ మేళా, క్యాంపస్ ఇంటర్వ్యూలలో పెద్ద పెద్ద సంస్థలు నైపుణ్యం ఉన్న వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి.- **సీహెచ్ జ్యోతి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, కడప.**

వీఆర్‌ఓపై టీడీపీ నాయకుల దౌర్జన్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : తంబళ్లపల్లి నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం మండలంలోని పులికల్లులో సర్వే నంబర్ 293లో ఉన్న ప్రభుత్వ వాగు పోరంబోకు స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వీఆర్‌ఓ వెంకటేష్ సోమవారం ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణ పనులు చేపట్టడం చట్టరీత్యా నేరమని పనులు నిలిపివేయాలని వీఆర్‌ఓ ఆక్రమణదారుడికి సూచించారు. దీంతో అక్కడే ఉన్న పలువురు టీడీపీ నాయకులు కలగజేసుకుని నీ వల్ల ఏమౌతుందో చేసుకోపో మేము పనులు మాత్రం నిలిపేది లేదని స్పష్టం చేస్తూ వీఆర్‌ఓపై దౌర్జన్యానికి దిగారు. ముందుగా గ్రామంలో, బస్టాండ్‌లో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకున్నాక ఇక్కడకు రావాలని చెప్పారు. జరిగిన విషయాన్ని వీఆర్‌ఓ లిఖిత పూర్వకంగా తహసీల్దార్‌కు నివేదించారు. ఈ విషయంపై తహసీల్దార్ శ్రీరాములు నాయక్ మాట్లాడుతూ ఈ సంఘటనపై నివేదిక తయారు చేస్తున్నామని తెలిపారు.

నలుగురిపై చీటింగ్ కేసు

రాజంపేట : మండలంలోని పెదకారంపల్లె పంచాయతీ పరిధిలో మన్నూరు పొలానికి కింద ఉన్న తనకు సంబంధించిన భూమి క్రయవిక్రయాలలో మోసం చేశారని భాస్కర్ అనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మన్నూరు సీఐ కుళాయప్ప మాట్లాడుతూ బాధితుడి ఫిర్యాదు మేరకు యోగేసు, వేణు, సహన, ఖాజాలపై చీటింగ్ కేసు నమోదు చేశామన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కూడా రిజిస్ట్రేషన్ వ్యవహారం తీరును పరిశీలిస్తామన్నారు.

కేబుల్ వైర్ చోరీ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు సమీపంలో జింకల బోర్లు క్రాస్ పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ బోర్ల వద్ద రైతులు ఏర్పాటు చేసుకున్న కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. నలుగురు రైతులకు చెందిన సుమారు 200 మీటర్ల కేబుల్ వైర్లను దొంగలు చాకచక్యంగా కత్తిరించుకుని వెళ్లినట్లు బాధిత రైతులు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు.

విజయవంతంగా హ్యాక థాన్


మిట్స్ కళాశాలలో 24 గంటల పాటు నిర్వహించిన హ్యాక్ థాన్

కురబలకోట: మదనపల్లె దగ్గర అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 24 గంటల పాటు జాతీయ స్థాయి ఇంటర్ ఇన్‌స్టిట్యూషనల్ హ్యాక థాన్ ఇంపాక్ట్-25ను విజయవంతంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ సోమవారం తెలిపారు. కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ విభాగాలు గీక్స్ ఫర్ గీక్స్ సహకారంతో దీనిని ప్రతిష్టాత్మకంగా నిర్వహించినట్లు తెలిపారు. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను పరిష్కరించే సాంకేతిక ఆధారిత పరిష్కారాలను రూపొందించడంలో ప్రేరేపించడం ఈ హ్యాక్‌థాన్ ప్రాథమిక లక్ష్యమన్నారు. 246 మంది 73 గ్రూపులుగా పోటీ బృందాలు ఇందులో పాల్గొన్నట్లు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లరినింగ్, ఎడెటెక్, హెల్త్‌కేర్, ఆగ్రోటెక్, స్మార్ట్ సిటీస్, సస్టైనబిలిటీ, ఎన్విరాన్‌మెంట్, స్టూడెంట్ ఇన్నోవేషన్ వంటి కీలక అంశాలపై విద్యార్థులు దృష్టి సారించారన్నారు. బెంగళూరుకు చెందిన గీక్స్ ఫర్ గీక్స్ లర్నింగ్ డైరెక్టర్ అభిషేక్ మాట్లాడుతూ ఇలాంటి హ్యాక్‌థాన్‌ల ద్వారా నిర్దిష్ట సమస్యను తరచుగా కంప్యూటర్ ప్రోగ్రామింగ్ లేదా సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన వాటిని పరిష్కరించడానికి ఉపయోగిస్తారన్నారు. విజేతలుగా నిలచిన పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల టెక్‌బ్రెయిట్ టీమ్ టి. మనోజ్‌కుమార్‌కు మొదటి బహుమతి కింద రూ.25వేలు, మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల డైనమోస్ టీమ్ కె. తిరిశాంక్‌కు రెండో బహుమతి రూ.20 వేలు, ఎస్‌వీ సెట్‌ది స్టైవర్స్ టీమ్ పి. దినేష్‌కుమార్ రెడ్డికి మూడవ బహుమతి కింద రూ.15వేలు, ఆ తర్వాత ఎస్‌వి సెట్ ఐటీ స్క్వాడ్ వై.శశిధర్ రెడ్డికి 10 వేలు, మిట్స్ కళాశాల మైల్ వర్త్ సి. బాలాజీకి రూ.5వేలు చొప్పున అందజేసినట్లు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ నాదేళ్ల విజయభాస్కర్ చౌదరి మాట్లాడుతూ హ్యాక్ థాన్‌లో పాల్గొనడం వల్ల టెక్నాలజీ ద్వారా సామాజిక మార్పు తీసుకురావడంలో విద్యార్థులు భాగస్వాములు కావచ్చన్నారు.

తేనెటీగల దాడిలో వృద్ధుడికి గాయాలు

మదనపల్లె : తేనెటీగల దాడిలో వృద్ధుడు గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లి మండలంలో జరిగింది. పెంచుపాడు పంచాయతీ గుట్టవారిపల్లెకు చెందిన చిన్న వెంకటరమణ (65) పశువులను మేత కోసం పొలం వద్దకు తోలుకొని వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వస్తుండగా మార్గ మధ్యంలో అకస్మాత్తుగా తేనెటీగల గుంపు దాడి చేసింది. దాడిలో చిన్న వెంకటరమణకు గాయాలు కాగా కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మన్నూరు సీఐను అభినందించిన ఏఎస్పీ

రాజంపేట : ఇంజనీరింగ్ విద్యార్థి అఖిల ఆత్మహత్య కేసును ఛేదించడంలో మన్నూరు సీఐ కుళాయప్ప కృషిని ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హేగ్డే అభినందించారు. విద్యార్థిని ఆత్మహత్యకు కారకుడైన నిందితుడు ప్రొద్దుటూరుకు చెందిన అనిల్‌కుమార్‌రెడ్డిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సీఐతో పాటు పోలీసులను ఆయన ప్రశంసించారు.

వేర్వేరు ఘటనలో ముగ్గురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రామసముద్రం మండలం చెంబుకూరు పంచాయతీ పాతురుకు చెందిన ఏ.గంగులప్ప (55) కుటుంబ సమస్యల కారణంగా భార్యతో గొడవపడ్డాడు. దీంతో ఆమె అలిగి పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్థాపం చెంది విష ద్రావణం తాగాడు. అదే విధంగా మదనపల్లె బాబు కాలనీకి చెందిన వెంకటరమణ కుమారుడు నాగరాజ (35) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భార్య మల్లీశ్వరితో కుటుంబ సమస్యల కారణంగా గొడవపడ్డాడు. ఆమె భర్తపై అలిగి పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్థాపం చెంది సోమవారం ఇంటి వద్ద పురుగు మందు తాగాడు. కురబలకోట మండలం కొంగావారిపల్లికి చెందిన విజయలక్ష్మి(30) కుటుంబ సమస్యల కారణంగా పురుగు మందు తాగింది. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పులివెందుల రూరల్ : పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఇతను గత కొన్ని రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిసి ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

వీరపునాయునిపల్లె : అప్పుల బాధ తాళలేక వెల్దుర్తి గ్రామానికి చెందిన మాతిగాళ్ల రఘు(42) అనే రైతు సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా.. రైతు సోమవారం ఉదయం పొలం దగ్గరికి వెళ్లి అక్కడే ఉన్న వేప చెట్టుకు ఉరివేసుకున్నాడు. చుట్టు పక్కల ఉన్న పొలాల రైతులు గుర్తించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి 1.5 ఎకరం పొలం ఉందని పొలంలో పంటలు సరిగ్గా రాక పోవడం ఒక కారణం కాగా, ముగ్గురు కుమార్తెల పెళ్లిల్లు ఎలా చేయాలన్నదే ఆత్మహత్యకు ప్రధాన కారణమని బంధువులు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం చేయరాదని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యతనిస్తూ పరిష్కరిస్తామని అదనపు ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు.

అదుపు తప్పి ద్విచక్ర వాహనం బోల్తా

ఇద్దరికి గాయాలు


అరుగును ఢీకొని గాయపడిన సుశాంత్

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్ మూడవ గేటు వద్ద సోమవారం ద్విచక్రవాహనదారుడు అదుపు తప్పి కిందపడిన ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దవటం మండలం కమ్మపాలెం ఎస్సీ కాలనీకి చెందిన ఎం.సుశాంత్, కల్లూరు కళ్యాణిలు ఇరువురు కడపలోని కళాశాలకు సోమవారం స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. వీరు భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్ మూడవ గేటు వద్దకు రాగానే బెటాలియన్‌లో నుంచి ఒక విద్యార్థి సైకిల్‌పై బయటకు వచ్చాడు. సుశాంత్ అతన్ని తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న అరుగును ఢీకొని బోల్తా పడ్డాడు. ఈ ప్రమాదంలో సుశాంత్‌కు రెండు కాళ్లు విరిగాయి, కళ్యాణి తలకు గాయాలయ్యాయి. వీరిని వైద్యం కోసం కడపలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించామని స్థానికులు తెలిపారు.

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య

రాయచోటి అర్బన్ : ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లా డుతూ ప్రజలను నమ్మించి వంచించడంలో చంద్రబాబును మించిన మహా ఘనుడు మరెవరూ లేరన్నారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ఊరూరా ఊదరగొట్టి ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 10 నెలలు గడుస్తున్నా హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదంటూ మండిపడ్డారు. వృద్ధాప్య పింఛన్, ఉచిత గ్యాస్ పథకాలు తప్ప మరేవీ అమలుకాకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబ శివ, శ్రీనివాసులు, సుమిత్ర, మురళి, శివరామక్రిష్ణ దేవర, జ్యోతి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ కూలి ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలు


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

మదనపల్లె : పాఠశాల ప్రహరీ కూలి ముగ్గురు విద్యార్థులు స్వల్పంగా గాయపడిన సంఘటన మదనపల్లెలో జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన వివరాలు.. పట్టణంలోని కోటబడి హైస్కూల్ పక్కనే ఉన్న ఇంటి గోడ ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా కూలడంతో, ఆ గోడకు ఆనుకుని ఉన్న పాఠశాల ప్రహరీ సైతం కూలింది. పక్కనే ఆడుకుంటున్న త్యాగరాజు వీధికి చెందిన విద్యార్థులు హేమ వరుణ్(12) చారుకేష్ (11)వేదాంత్(04) స్వల్పంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు విద్యార్థులను ఆసుపత్రికి తరలించారు. సోమవారం ఉదయం ఎమ్మెల్యే షాజహాన్ బాషా పాఠశాలకు చేరుకుని కూలిన గోడను పరిశీలించారు. వేసవి సెలవులు కావడంతో పాఠశాలలో విద్యార్థులు ఎవరూ లేరు. ప్రమాద సమయంలో నీటి డ్రమ్ము గోడ పక్కన ఉండడం వల్ల ఆడుకుంటున్న విద్యార్థులు పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

సుండుపల్లె : మండల పరిధిలోని రాయవరం గ్రామ పంచాయతీ రాయవరం కస్పాలో నివాసం ఉండే పగడాల మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రాయవరం కస్పాలో పాముల రామకృష్ణ పొలంలో పగడాల మహేష్ గేదెలు మేపాడని రామకృష్ణ, అతని కుటుంబ సభ్యులు తన భర్త మహేష్, మామ నరసింహులుపై దాడి చేశారని పగడాల మల్లీశ్వరి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వై.కోటలోని బంజరు భూములను పేదలకు పంచి పెట్టాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీకేఎంయూ నాయకులు

రాయచోటి అర్బన్ : ఓబులవారిపల్లె మండలం బాల్‌రెడ్డిగారి పల్లె పంచాయతీ వై.కోట గ్రామ పొలం సర్వే నంబరు 1150 లో గ్రామపెత్తందార్లు, కబ్జాదారుల ఆక్రమణలో ఉన్న సుమారు 150 ఎకరాల బంజరు భూములను ప్రభుత్వం వెంటనే పేదలకు పంచిపెట్టాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా అధ్యక్షుడు పందుగోల మణి, రైల్వేకోడూరు కార్యదర్శి జ్యోతిచిన్నయ్యలు జిల్లా కలెక్టర్ శ్రీధర్‌కు విన్నవించారు. రాయచోటి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు కలెక్టర్‌తో మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు అక్రమంగా ఇతరులకు కట్టబెట్టిన ప్రభుత్వ, బంజరు భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. వాటిని నిరుపేద గిరిజన కుటుంబాలకు రెండేసి ఎకరాల చొప్పున పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఓబులవారిపల్లె మండల కార్యదర్శి చంతలపూడి నాగమ్మ, బీకేఎంయూ నాయకులు జయరామయ్య, మల్లిక వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ఒంటిమిట్ట: మండల పరిధిలోని పోలు బుచ్చయ్యగారిపల్లి గ్రామానికి చెందిన నల్లగొండ నరసింహారెడ్డి భార్య నల్లగొండ కృష్ణమ్మ (55) సోమవారం విష ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఒంటిమిట్ట ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. ఆయన కథనం మేరకు నల్లగొండ నరసింహారెడ్డి, కృష్ణమ్మలకు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరందరికీ వివాహం కాగా కుమారులు బతుకుదెరువు నిమిత్తం కువైట్‌లో ఉన్నారు. వారి కోడళ్లు పిల్లల చదువుల నిమిత్తం కడపలో నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం నరసింహారెడ్డి, కృష్ణమ్మలు పోలుబుచ్చయ్యగారిపల్లిలో వారి సొంత ఇంటిలో నివాసం ఉంటున్నారు. నరసింహారెడ్డి తనకున్న భూములను సాగు చేసుకునేవాడు. ఇది ఇలా ఉండగా ఐదేళ్ల క్రితం నుంచి కృష్ణమ్మకు కుడివైపున తుంటి వద్ద కీళ్లు అరిగి తీవ్రమైన నడుము నొప్పి ఉంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నొప్పి తగ్గకపోవడంతో ఆమె తరచూ ఆత్మహత్య చేసుకుంటానని చెప్పేది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఎప్పటిలాగే పొలం పనికి వెళ్లిన నరసింహారెడ్డికి తన అన్న కోడలు నల్లగొండు దేవి ఫోన్ చేసి కృష్ణమ్మ విష ద్రావణం తాగిందని తెలిపారు. వెంటనే ఆయన ఇంటికి వచ్చి ఆమెను 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కడపలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని అక్కడి డాక్టర్లు చెప్పడంతో మళ్లీ కడప రిమ్స్‌కు తీసుకురాగా అక్కడి వైద్యులు పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి భర్త నల్లగొండ నరసింహారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.